క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు


బద్వేలు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి


బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : బద్వేలు నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు బద్వేలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి నియోజకవర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ఏపీటీఎఫ్ రీజినల్ కార్యాలయంలో శనివారం జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.

జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాణితిరుమలదేవి డిగ్రీకాలేజిలో శనివారం హెటిరో ల్యాబ్స్ వారి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలలో 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇందులో 13 మంది తమ కళాశాల విద్యార్థులు ఎంపికై నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, హెటిరో ల్యాబ్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : గత 20 సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు రామమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆపస్ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బోధనోపకరణాలపై శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రొద్దుటూరు డివిజన్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులకు బోధనోపకరణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నూతన పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభతరంగా బోధించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సెక్రటరీ కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ సీవీ రామన్ సైన్స్ క్లబ్ తరపున సైన్స్ టూర్, సైన్స్ ఉపాధ్యాయులకు ప్రతి రెండో శనివారం వివిధ సైన్స్ అంశాల మీద అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సలహాదారులు, ప్రధానోపాధ్యాయులు రవి ప్రకాష్, గోపీనాథ్‌రెడ్డి, కాశీప్రసాద్‌రెడ్డి, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగంగా మార్కెట్ నిర్మాణ పనులు


మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక శివాలయం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ పనులను శనివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమలోనే తొలి సారిగా అత్యాధునిక సౌకర్యాలతో రూ.53 కోట్లతో కూరగాయల మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. గడువు లోపు మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్య పరిష్కరించాలి


సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఖాజీపేట మండల వైఎస్సార్ సీపీ నాయకులు

కడప అగ్రికల్చర్: ఖాజీపేట మండలంలో పరిధిలోని చుక్కల భూముల విషయమై చాలా మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కో ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటి ప్రెసిడెంట్ పివి రాఘవరెడ్డి తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇడుపులపాయలో కలిసి చుక్కల భూమి సమస్యను వివరించడంతోపాటు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించామన్నారు. ఈ విషయమై శనివారం వారు మాట్లాడుతూ ఖాజీపేట మండలంలో దాదాపు 4 వేల ఎకరాలు చుక్కల భూములు ఉన్నాయన్నారు. గతంలో చుక్కల భూముల నిషేధిత జాబితా 22 తయారు చేసే క్రమంలో అప్పటి రెవెన్యూ సిబ్బంది తప్పదం కారణంగా ప్రతి గ్రామ నుంచి చాలా మంది రైతులకు ఆన్‌లైన్‌లో మ్యూటేషన్ కాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో రైతులు తమ పొలాలను అమ్ముకోవాలన్నా, కొనాలన్నా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలను కూడా తెచ్చుకోలేక పోతున్నారన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పందించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారం మరువలేనిది


మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి

రాజుపాళెం : రాజుపాళెం మండలంలో వెలవలి, టంగుటూరు బ్రాంచ్ కాలువల్లో ఉన్న పూడికతీత, జమ్ము తొలగించేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి సహకారం మరువలేనిదని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి అన్నారు. వెంగళాయపల్లె గ్రామ సమీపంలోని టంగుటూరు బ్రాంచ్ కెనాల్ వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో కేసీ చాపాడు, మైలవరం కాలువలకు నీటిని విడుదల చేయించడంతో ఎమ్మెల్యే రాచమల్లుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలువల్లో పూడికతీత తీసేందుకు ఎమ్మెల్యే సొంత నిధులు ఇస్తానని చెప్పడం మంచిదేనని, రైతులంతా ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రద్ధ పెట్టడంతోనే రైతులకు సకాలంలో పంటలకు నీటిని అందించగలుగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర రెడ్డి, గౌతం రెడ్డి, వెంకటరెడ్డి, ధనిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మౌలాన అబుల్ కలాం జయంతి


బహుమతి అందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాసనగర్‌లోని రేడియన్స్ హైస్కూల్‌లో శనివారం మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి సలీం పేర్కొన్నారు. కార్యక్రమంలో దాదా ఖలందర్, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాషా, కార్యదర్శి అస్లాం, పాఠశాల డైరెక్టర్ మొహిద్దీన్, రఫి, రవి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించండి

ప్రొద్దుటూరు : దళితుల మధ్య చిచ్చు పెట్టే ఎస్సీ వర్గీకరణను భారత ప్రధాని నరేంద్రమోదీ వ్యతిరేకించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల జయరాజ్ పేర్కొన్నారు. స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పించి అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బాబు, మండల అధ్యక్షుడు పుల్లయ్య, రాజా, భాస్కర్, పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, దావీదు, పుష్పరాజు, మనోహర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డోర్ డెలివరీ సర్వీసు వినియోగించుకోండి

ప్రొద్దుటూరు : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకుని బహుమతులు పొందాలని ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో కార్గో పాయింట్‌లో డోర్ డెలివరీ మాసోత్సవంలో భాగంగా రెండో శనివారం డ్రాలో గిఫ్ట్ బాలాజీకి దక్కింది. కొత్తాస్ వారి సహకారంతో గిఫ్ట్‌ను డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి అందించారు.

అల్లాడుపల్లె మీదుగా ప్రొద్దుటూరుకు బస్ సర్వీసులు

మైదుకూరు : మైదుకూరు డిపోకు చెందిన మైదుకూరు – ప్రొద్దుటూరు షటిల్ బస్సు సర్వీసులను అల్లాడుపల్లె దేవాలయాలు మీదుగా నడిపేందుకు నిర్ణయించినట్లు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 13 నుంచి మైదుకూరు నుంచి అల్లాడుపల్లె దేవళాలు, సీతారామాపురం గ్రామాల మీదుగా బస్సులు ప్రొద్దుటూరుకు వెళతాయని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అల్లాడుపల్లె దేవళాలకు వెళ్లే భక్తులు, సీతారామాపురం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ సేవలను వినియోగించుకుని, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు.

టపాసు దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి

బద్వేలు అర్బన్ : దీపావళి సందర్భంగా అనుమతి తీసుకుని టపాసు దుకాణాలు ఏర్పాటుచేసిన వ్యాపారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అర్బన్ ఇన్‌స్పెక్టర్ పి.యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డులో ఏర్పాటుచేసిన టపాసుల స్టాల్స్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ పొందినవారు మాత్రమే టపాసుల విక్రయాలు సాగించాలని అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చంద్రమోహన్ మృతి తీరని లోటు


చంద్రమోహన్‌తో జింకా సుబ్రహ్మణ్యం (ఫైల్)

ప్రొద్దుటూరు కల్చరల్ : సినీ నటుడు చంద్రమోహన్ మృతి చిత్రసీమకు తీరని లోటని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన హీరోగా, క్యారెక్టర్ ఆరిస్టుగా నటించి అందరి మన్ననలు పొందారని తెలిపారు. 1990, 1994 సంవత్సరాల్లో ప్రొద్దుటూరులో నిర్వహించిన ప్రొద్దుటూరు రవికళానికేతన్ వార్షికోత్సవంలో చంద్రమోహన్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు కళాకారులకు ఆయనతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.

బీపీ సుధాకర్ రెడ్డి ఏపార్టీ నాయకుడు?

మైదుకూరు : మైదుకూరు మార్కెట్ మాజీ చైర్మన్ బీపీ సుధాకర్‌రెడ్డి వైఎస్సార్ సీపీ నాయకుడా, టీడీపీ నాయకుడా అని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న ప్రశ్నించారు. బీపీ సుధాకర్‌రెడ్డి శుక్రవారం టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించిన విషయం తెలిసిందే. సుధాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్లుగా ప్రకటించడం పట్ల లింగన్న ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీపీ సుధాకర్‌రెడ్డి అసలు వైఎస్సార్‌సీపీలో ఉన్నారా? ఉంటే ఆయన వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ఏ కార్యక్రమాల్లో పాల్గొన్నారో చెప్పాలన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయండి

పోరుమామిళ్ల : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జయప్రదం చేయాలని పోరుమామిళ్ల గ్రంథాలయ అధికారి అఫ్రిది, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గసభ్యులు దాదాపీర్, ఖాశింవలి, గఫార్ కోరారు. శనివారం వారోత్సవాల పోస్టర్లు విడుదల చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మైదుకూరు : ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు మండలంలోని వనిపెంట శాఖా గ్రంథాలయం నిర్వాహకురాలు పార్వతి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పుస్తక ప్రదర్శనలు, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు టంగుటూరు విద్యార్థి


కబడ్డీ పోటీలకు ఎంపికైన ఆసిఫ్‌తో హెచ్‌ఎం, పీఈటీలు

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆసిఫ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ప్రభావతి, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్ర ఓబుళ రెడ్డి తెలిపారు. వారు ఆపాఠశాలలో శనివారం మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన రైల్వేకోడూరులో స్కూల్ గేమ్స్ అండర్ 14 కబడ్డీ సెలక్షన్ జరిగాయన్నారు. అందులో ఆసిఫ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని చెప్పారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు చిట్వేలిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో ఆసిఫ్ పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల హెచ్‌ఎం, పీఈటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సౌత్ జోన్ ఖోఖో జట్టుకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని లావణ్యను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజి బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.లావణ్య జేఎన్‌టీయూఏ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ప్రతిభ చూపి సౌత్ జోన్ ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాకాంతం తెలిపారు. త్వరలో తమిళనాడులో జరిగే సౌత్ జోన్ ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూషా, ఫిజికల్ డైరెక్టర్ ఓబయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రంగులలోకంలో చిన్నారుల సందడి


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కడప కల్చరల్ / కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిన్నారుల సందడితో కనువిందు చేసింది. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు బుద్ధిగా అట్టలు, రంగులతో వచ్చి తమకు వచ్చిన బొమ్మలు గీసి రంగులు నింపి పోటీలో పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక బాలోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి దాదాపు 900 మంది చిన్నారులు హాజరయ్యారు. మూడు విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీకి చిన్నారులు భారీగా తరలి రావడంతో నిర్వాహకుల్లో ఆనందం నెలకొంది. కన్వీనింగ్ కమిటీ సభ్యులు బి.లక్ష్మిరాజా, బి.రాజశేఖర్ రాహుల్, కళాశాల నిర్వాహకుల ద్వారా పోటీలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. 3 గంటలపాటు కళాశాల ప్రాంగణం బొమ్మలు గీసేందుకు వచ్చిన చిన్నారులతో కళకళలాడింది.

సృజనను పెంచేందుకు..

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయటానికి జిల్లాలో బాలోత్సవం సంస్థ శాఖను ఏర్పాటు చేశామని లక్ష్మి రాజా, రాజశేఖర్ రాహుల్ తెలిపారు. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల తోపాటు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని వివరించారు. ఈ నెల 14న బాలల దినోత్సవ సందర్భంగా ఇదే కళాశాలలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవ కన్వీనింగ్ కమిటీ ప్రతినిధి ఎస్‌ఎస్‌ఏ పీఓ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వీర సుధాకర్‌రెడ్డి, బి.గోపాల్. నాగ మునిరెడ్డి, బాల ఎల్లారెడ్డి, కోటా మృత్యుంజయరావు, దేవదత్తం, వెంకటేశ్వర్లు, సురేష్ బాబు, రఘునాథరెడ్డి, కరీం, సునీత తదితరులు పాల్గొన్నారు.